ఈవీఎంల తనిఖీ పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 5 : జిల్లాలో ఈవీఎంల మొదటిస్థాయి తనిఖీ(ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియను ఈనెల 14వ తేదీ వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకప్‌ను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఇంజినీరింగ్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. సోమవారం ఉదయం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రారంభమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటిస్థాయి తనిఖీల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ నియమించిన నోడల్ అధికారి అదనపు కలెక్టర్ రెవెన్యూ సీతారామారావు పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. రానున్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని వివిధ పార్టీల నాయకుల సమక్షంలో చేపడుతున్న ఈవీఎం తనిఖీ కార్యక్రమాల వివరాలను అదనపు కలెక్టర్‌తో తెలుసుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. భద్రత, తదితర అంశాల ఏర్పాటుపై సూచనలు చేశారు. కేవలం ఈవీఎంల తనిఖీల విధులు నిర్వహించే అధికారులను, ప్రత్యేక పాసు కలిగిన వారిని మాత్రమే లోపలికి అనుమతించేలా చర్యలు చేపట్టాలని, ఏ ఒక్కరి సెల్‌ఫోన్లు అనుమతించవద్దని కలెక్టర్ భద్రతా సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని అచ్చంపేట, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన 1300 ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ యంత్రాలను రానున్న పది రోజుల్లో బ్యాలెట్ యూనిట్ కంట్రోల్ యూనిట్ వీవీ ప్యాట్‌ల పూర్తిస్థాయి పనితీరుపై తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ఈవీఎంల పనితీరు, మాక్ పోలింగ్ తదితర అంశాల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. అంతకుముందు కలెక్టర్ నాగర్‌కర్నూల్, నెల్లికొండ వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద భద్రపరిచిన వీవీప్యాట్ల గోదామును తనిఖీ చేసి, రిజిస్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఈవీఎంల ప్రత్యేక ఇంజినీర్ అధికారులు అమోద్‌కుమార్, జావేద్, అక్తర్, అనీశ్ యాదవ్, ఆర్.శ్రీను వారి బృందం కలెక్టరేట్ సూపరింటెండెంట్లు జాకీర్‌అలీ, కార్తీక్ రఘు, బాలరాజు, ఈడీఎం నరేశ్, ఎన్ఐసీ కోఆర్డినేటర్ అర్షద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బాలకృష్ణ, కుర్మయ్య పాల్గొన్నారు.

పదిలో ఉత్తీర్ణత సాధించాలి

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 5: ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో విద్యార్థుల ఉత్తీర్ణత వంద శాతానికి చేరుకోవాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. పెద్దకొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను సోమవారం సాయంత్రం కలెక్టర్ ఉదయ్‌ఖుమార్ తనిఖీ చేశారు. ప్రత్యేక తరగతుల సబ్జెక్టుల వివరాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రత్యేక తరగతులకు హాజరయ్యే సబ్జెక్టు ఉపాధ్యాయుల గురించి ఆరా తీశారు. పాఠశాలలో ప్రస్తుతం పదో తరగతిలో 123 మంది విద్యార్థులు చదువుతున్నారని, గత ఏడాది 10వ తరగతి పరీక్షల్లో 90శాతం ఉత్తీర్ణత సాధించారని హెచ్ఎం మద్దిలేటి కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పది ఫలితాలు గతేడాది కంటే మెరుగ్గా ఉండాలని సూచించారు. చురుగ్గా ఉన్న విద్యార్థులు మిగితా అన్ని సబ్జెక్టుల్లోనూ చదివి మంచి మార్కులు సాధించాలని తెలిపారు.

తనిఖీలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించండి : కలెక్టర్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 5: ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 80 ఫిర్యాదుల్లో 60 ఫిర్యాదులు భూ సమస్యలపై ఉన్నాయని, మిగతా 20 వివిధ సమస్యలపై అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో గోవిందరాజులు

విద్యాబోధన.. ప్రయోగాలతో చేయాలి

- డీఈవో గోవిందరాజులు

నాగర్‌కర్నూల్‌టౌన్, ఫిబ్రవరి 5 : జీవ, భౌతికశాస్త్ర పాఠ్యాంశాలపై విద్యార్థులకు ఆసక్తిని పెంచేలా సైన్స్ ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యా బోధన ప్రయోగాలతో చేయాలని డీఈవో గోవిందరాజులు అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైన్స్ అకాడమి వారి సాకారంతో జిల్లాలోని జీవశాస్త్రం, భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ తరగతులను సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రారంభించారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యం పెరుగుతుందని, తద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు జీవశాస్త్ర, భౌతిక రసాయన శాస్త్రాల ప్రయోగ కృత్యాలను ఉపాధ్యాయులు మొదటి రోజు వర్క్‌షాప్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగరాజు, సైన్స్ అకాడమీ మాస్టర్ ట్రైనర్స్ రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి మాటలు బూటకం

అమ్రాబాద్, ఫిబ్రవరి 5: సీఎం రేవంత్ రెడ్డి మాటలు బూటకాలని బీఆర్ఎ స్ మండల యువ నాయకు లు ఎర్రనాసర్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా ప్రాజెక్టులను కేంద్రాని కి ధారాదత్తం చేశార ని, సీఎం పదవిలో ఉంటూ ఝూట మాటలతో తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నా రు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివ పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 5: పట్టణంలో జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్లబ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ స్వామి, కోశాధికారి సంబు శ్రీనివాసులు హాజరై విద్యార్థులకు రూ.3వేల విలువగల క్రీడా సామగ్రిని, పెద్దకొత్తపల్లిలో రూ.3వేల విలువగల స్టడీ మెటీరియల్, వరంగల్ విద్యార్థిని ఆర్.సంధ్యకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు, కోశాధికారిని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవన్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ డివిజన్ అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి సాయిప్రసాద్, పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

అచ్చంపేట, ఫిబ్రవరి 5: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15ను ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని అచ్చంపేట గిరిజన నేతలు గోపాల్‌నాయక్, జైపాల్‌నాయక్, పర్వతాలు, వసూరం సోమవారం ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిధులు కేటాయించి, ప్రభుత్వపరంగా నిర్వహించిందని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిధులు కేటాయించి ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.అచ్చంపేటలో సేవాలాల్ మందిరం నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 5: కార్మికుల హక్కులకోసం ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కోటంరాజు పిలుపునిచ్చారు. సోమవారం కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం జరుగుతున్న సమ్మెకు అన్ని ప్రజాసంఘాలు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.

పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 5: ఈనెల 16న జరిగే కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆశావర్కర్లతో కలిసి మండల కేంద్రం సమీపంలోని పీహెచ్‌సీలో డాక్టర్ చంద్రశేఖర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకురాలు శ్రీదేవి, శివలీల, మమత పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 5 :ఈనెల 16న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకుడు శివవర్మ పిలుపునిచ్చారు. సోమవారం కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం జరుగుతున్న సమ్మెకు అన్ని ప్రజాసంఘాలు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.

అన్ని హంగులతో ఎన్టీఆర్ స్టేడియం

అచ్చంపేటలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

- మార్నింగ్‌వాక్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, ఫిబ్రవరి 5 : అచ్చంపేటలో ని ఎన్టీఆర్ స్టేడియాన్ని అన్ని వసతులతో నిర్మిస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం ఉదయం మార్నింగ్‌వాక్‌లో భాగంగా అచ్చంపేట ఎన్టీఆర్ స్టేడియాన్ని పరిశీలించారు. వాకర్స్‌తో కలిసి కొద్దిసేపు వాకింగ్ చేశారు. అనంతరం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వంశీకృష్ణను సన్మానించగా, వాకర్స్ నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేడియంలో అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవలే సీఎం రేవంత్‌ను కలిసి అచ్చంపేట అభివృద్ధిపై చర్చించినట్లు చెప్పారు. స్టేడియం కోసం విడుతలవారీగా నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు చందూ నాయక్, అధ్యక్షుడు భగీర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి డిప్యూటీ తాసీల్దార్ రమేశ్, కోశాధికారి నాగేశ్, నర్సోజీ, శివశంకర్, ఖదీర్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

అచ్చంపేట, ఫిబ్రవరి 5: పట్టణంలోని డాక్టర్ అంబేద్కర్ ప్రజాభవన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అచ్చంపేట, బల్మూర్, లింగాల, పదర మండలాలకు చెందిన 300మంది చెక్కులు అందుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గోపీరాం, తాసీల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.

వసతులను సద్వినియోగం చేసుకోవాలి

వంగూరు, ఫిబ్రవరి 5 : విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మండలంలోని రంగాపూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ప్రహరీ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో తాసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో విజయభాస్కర్, ఎంఈవో శంకర్‌నాయక్, పండిత్‌రావు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితేనే ఉజ్వల భవిష్యత్

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 5: లక్ష్యంతోని చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. పట్టణంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఒక లక్ష్యంతో విద్యను కొనసాగిస్తేనే ఉన్నత స్థాయికి చేరుకోగలమన్నారు. అనంతరం ఇంటర్ జిల్లా అధికారి వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను మార్చేది ఇంటర్మీడియెట్ విద్య అన్నారు. ప్రతి విద్యార్థి జాగ్రత్తగా చదువుకోవాలనని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

7న మంత్రి జూపల్లి సన్మాన సభ

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 5: మంత్రి జూపల్లి కృష్ణారావుకు తెనుగు, ముదిరాజుల కమ్యూనిటీల ఆధ్వర్యంలో సన్మాన సభను ఈనెల 7న కొల్లాపూర్‌లో నిర్వహిస్తున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ భయ్యా వెంకటస్వామి, డాక్టర్ పగిడాల శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు తెలిపారు. సోమవారం పట్టణంలో గంగభవాని ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. కార్యక్రమానికి మంత్రి జూపల్లి, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లురవి, ఎమ్మెల్యే శ్రీహరికి సన్మానిస్తారన్నారు.

యువత ఆదర్శవంతులు కావాలి

వెల్దండ, ఫిబ్రవరి 5 : యువత భవిష్యత్ తరాలకు ఆదర్శవంతులు కావాలని సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్యగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన సురేష్ ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో స్వీట్లు తినిపించి అభినందించారు. కార్యక్రమంలో హమీద్, రాజు, శ్రీను, అల్లాజీ, మహేశ్ తదితరులు ఉన్నారు.

ఆంగ్ల భాషపై పట్టుసాధించాలి

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 5 : విద్యార్థులు మాతృభాషతో పాటుగా ఆంగ్లభాషపైన పట్టు సాధించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్లభాషా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి స్పెల్ విజర్డ్ డ్రామా కాంపిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం వెంకటరమణ, రాజ్యలత, కవిత, ఉన్నారు.

యాసంగిపై అవగాహన సదస్సు

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 5: అచ్చంపేట లోని వ్యవసాయ కార్యాలయంలో సోమవారంలో ఫర్టిలైజర్ వ్యాపారులకు యాసంగి సీజన్‌కు సంబంధించి వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కె.కృష్ణయ్య మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల వ్యాపారం నిర్వహించడంలో నిర్ణయాలను జాగ్రత్తగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, అచ్చంపేట మండలంలోని ఫర్టిలైజర్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 5: మండల పరిధిలోని చంద్రకల్, ముష్టిపల్లి గ్రామాల్లోని నర్సరీని సోమవారం డిప్యూటీ తాసీల్దార్ రమేశ్‌నాయక్ పరిశీలించారు. మొక్కలను జాగ్రత్తగా పెంచాలని నిర్వాహకులకు చెప్పారు. కార్యదర్శులు ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు.

హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 5 : మండలంలోను నర్సరీల్లో గ్రామ అవసరాలకనుగుణంగా మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. సోమవారం మండలంలోని ఎల్లికల్, ముకురాల, తోటపల్లి ఎంపీడీవో, లింగసానిపల్లి, గుండూరు గ్రామాలను ఎంపీవో దేవేందర్‌లు విడివిడిగా సందర్శించారు. ఈ సందర్భంగా నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ప్రతినిత్యం నీటిని అందించడంతో పాటు చెట్లను సంరక్షించాలని కోరారు. అంతకుముందు పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో చంద్రసిద్ధార్థ, కార్యదర్శులు లింగం, అభిజిత్‌రెడ్డి, సురేశ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు మైక్ వితరణ

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఈసందర్భంగా హెచ్.ఎం మాట్లాడుతూ బడికి మైక్‌సెట్‌ను అందించడం సంతోషదాయకమన్నారు. పాఠశాలలో సమస్యల పరిష్కారానికి ఆవోపా సేవా సంస్థ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిశంకర్, సునీల, ప్రమీల, దేవయ్య, శారత తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి మరిచిన అధికారులు

చారకొండ, ఫిబ్రవరి 5 : మండలంలో తాసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించాలని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్న మండలంలో అధికారులు ప్రజావాణి నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రజావాణిలో ఫిర్యాదుకు చేయడానికి ఉన్నతాధికారులు అవకాశం కల్పించిన మండలంలో అన్ని శాఖల అధికారులు మాత్రం తమకు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గతరెండు వారాలుగా ప్రజావాణి నిర్వహించడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ప్రజావాణి నిర్వహించాలని కోరుతున్నారు.

ఘనంగా స్వయం పరిపాలన

వెల్దండ, ఫిబ్రవరి 5 : మండలంలోని గొల్లోనిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రవినాయక్, ఉపాధ్యాయులు పావని, యాదగిరి పాల్గొన్నారు.

స్వయం పరిపాలనలో గొల్లోనిపల్లి పాఠశాల విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 5: పట్టణానికి చెందిన సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 1994-95 బ్యాచ్ నుంచి 7వ తరగతి వరకు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం హైదరాబాద్‌లోని కొండాపూర్ ప్లెచాజో హోటల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో రామ్మోహన్, రాఘవేందర్, రామాచారి పాల్గొన్నారు.

సాగు.. గ్రామ వనరులపై ప్రదర్శన

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 5: మండలంలోని ఆవంచ గ్రామంలో కేవీకే పాలెంకు చెందిన రావేఫ్ విద్యార్థినులు సోమవారం గ్రామీణ భాగస్వామ్య విశ్లేషనాత్మక తులనం పేరిట (పీఆర్ఏ) నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రామ వనరులు, రైతుల సాగు, ప్రాధాన్యత, నేల స్వభావం, ప్రభుత్వ పథకాలు అనే అంశాలపై గ్రామపటం వేసి రైతులకు అవగాహన కల్పించారు. చపాతి పటం ద్వారా గ్రామంలో పాఠశాలలు, బ్యాంకులు, వాటర్‌ట్యాంకులు, అంగన్‌వాడీలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సబ్‌స్టేషన్, బస్టాండ్ దూరాలను తెలిపారు. తిమ్మాజిపేట ఏవో కమల్‌కుమార్, ఏఈవో సాయిరాం విద్యార్థినులు రూపొందించిన అంశాలను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థినులు జయశ్రీ, శ్రీజ, అంకిత, శృతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా నాగశేఖర్‌రెడ్డి

బిజినేపల్లి, ఫిబ్రవరి 5: ఎస్సైగా నాగశేఖర్‌రెడ్డి సోమవారం విధులు స్వీకరించారు. గద్వాల నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై రాములు అచ్చంపేటకు బదిలీ అయ్యారు.

ఎస్సైకి సన్మానం

వెల్దండ, ఫిబ్రవరి 5 : సోమవారం నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రవిని విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ యాదవ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతుహక్కుల సాధన తాలూకా అధ్యక్షుడు రాములుయాదవ్, చాంద్‌పాషా, సాంబ, కృష్ణయ్య, నరేందర్, రాధ క్రిష్ణ, వెంకటేశ్, సురేశ్‌యాదవ్ ఉన్నారు.

వంగూరులో..

వంగూరు, ఫిబ్రవరి 5 : మండలానికి నూతనంగా వచ్చిన ఎస్సై మహేందర్‌ను సోమవారం మండలంలోని పొల్కంపల్లికి చెందిన కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురేందర్, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు నిజాముద్దీన్‌లు కలిసి పుష్పగుచ్ఛ అందించి శుభాకాంక్షలు తెలిపారు.

చారకొండలో..

చారకొండ, ఫిబ్రవరి 5 : నూతన ఎస్సై రాజశేఖర్ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మాజీ జెడ్పీటీసీ భీముడునాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్యయాదవ్, మండల అధ్యక్షుడు బలరాంగౌడ్ ఆధ్వర్యంలో ఎస్సైకి శాలువా, పూలమాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, ముస్తాఫాముజ్జు, వెంకటయ్యగౌడ్, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ ఎస్సైగా గోవర్ధన్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 5: జిల్లా కేంద్రం ఎస్సైగా గోవర్ధన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై మహేందర్, వంగూరు మండలానికి బదిలీ అయ్యారు.

అంతరాలు లేని విద్యకోసం ఉద్యమించాలి

వెల్దండ, ఫిబ్రవరి 5 : అందరికీ సమాన విద్యనందించడం ప్రభుత్వ బాధ్యతని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభల గోడపత్రిక విడుదల చేశారు. అంతరాలు లేని విద్యకోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి, ప్రసన్నలక్ష్మి అన్నారు.

పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న పీజీ విద్యార్థులు

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 5: కొల్లాపూర్ పట్టణంలోని పీజీ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ డే ఉత్సాహంగా నిర్వహించారు. కొత్తగా కళాశాలలో ప్రవేశం పొందిన వారికి సీనియర్ విద్యార్థులు ఆహ్వానం పలికారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

లింగాల, ఫిబ్రవరి 5: ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువుల నిల్వల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అచ్చంపేట ఏడీఏ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు.

15నుంచి సూర్యనారాయణ స్వామి ఉత్సవాలు

తాడూరు, ఫిబ్రవరి 5 : మండల పరిధిలోని భలాన్‌పల్లిలో ఈనెల 15నుంచి సూర్యనారాయణ స్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి నాగభూషణ శర్మ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. 17న సత్యనారాయణ స్వామి వ్రతాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జూపల్లిలో చోరీ..

చారకొండ, ఫిబ్రవరి 5: తాళం వేసిన ఓ ఇంట్లో నగదుతో పాటు బంగారం చోరీకి గురైన ఘటన మండలంలోని జూపల్లిలో చోటు చేసుకున్నది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం జూపల్లికి చెందిన ఎండీ రియాజ్ అదేగ్రామంలో తన మేనమామ చనిపోవడంతో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 2న వెళ్లారు. సోమవారం తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం పగలగొట్టి ఉన్నది. బీరువా త